సమాచారం

అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో.. ట్రాఫిక్ మళ్లింపు

కుత్బుల్లాపూర్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న బాక్స్ డ్రెయిన్ కన్స్ట్రక్షన్ పనుల నేపథ్యంలో అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ట్రాఫిక్‌ను మళ్లిస్తూ సైబరాబాద్ ట్రాఫిక్ డిప్యూటీ కమిషన్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఓల్డ్ అల్వాల్‌లోని జ్యోతినగర్ జంక్షన్, రెడ్డి ఎన్‌క్లేవ్‌లో బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనుల నేపథ్యంలో జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. రాజీవ్ రహదారిలో సుచిత్రకు వెళ్లే వాహనాలను ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహం, వయా గోల్నాకా మీసేవా మీదుగా శ్రీబేకరీ, అంబేడ్కర్ విగ్రహం, అల్వాల్ ఐజీ స్టాట్యూ వైపు, అదే విధంగా సుచిత్ర, అల్వాల్ ఐజీ స్టాట్యూ మీదుగా రాజీవ్ రహదారికి వచ్చే వాహనాలను అల్వాల్ ఐజీ స్టాట్యూ, అంబేడ్కర్ స్టాట్యూ, శ్రీబేకరీ, తెలంగాణ తల్లి, మీసేవ గోల్నాక మీదుగా రాజీవ్ రహదారికి మళ్లించనున్నారు. వాహనదారులు ఈ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

8న అయోధ్యనగర్ బస్తీ ఎన్నికలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్ బస్తీ నూతన కమిటీ ఎన్నికలను ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఈ నెల 5న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల స్వీకరణ, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. ఈ నెల 6, 7 తేదీల్లో రాత్రి 7 గంటల వరకు అభ్యర్థులు ప్రచారం ముగించాల్సి ఉంటుంది. 8వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు రూ.10వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, ఇది ఎట్టి పరిస్థితుల్లో వాపస్ ఇవ్వబడదని, సొంతిళ్లు ఉన్న అయోధ్యనగర్ నివాసితులు మాత్రమే నామినేషన్లు వేసేందుకు అర్హులని వారు స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ప్రాథమిక పాఠశాలల్లోనే విద్యార్థుల భవిష్యత్‌కు పునాది



విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డులను అందజేస్తున్న ఖాజాపాషా

కుత్బుల్లాపూర్: విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక పాఠశాలలోనే పునాది పడుతుందని కుత్బుల్లాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఖాజాపాషా అన్నారు. వెన్నెలగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాత వారాల రాజు సహకారంతో సోమవారం విద్యార్థులకు గుర్తింపు కార్డులు, బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వెన్నెలగడ్డ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, తుకారం, అనిల్, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పదంగా విద్యార్థిని ఆత్మహత్య



శ్వేత (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదంగా ఓ ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లో నివాసముండే శ్రీరామదుర్గాప్రసాద్, అరుణ దంపతుల కుమార్తె శ్వేత(17) మారేడ్‌పల్లిలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఈ నెల 1వ తేదీ రాత్రి 9.30 గంటలకు శ్వేతతో కలిసి అరుణ బెడ్రూమ్‌లో నిద్రించింది. 2న ఉదయం 5.30 గంటలకు నిద్ర లేచి చూసేసరికి కుమార్తె కనిపించలేదు. అయితే స్టడీరూమ్‌లో చదువుకుంటోందని వెళ్లి చూడగా శ్వేత చున్నీతో సీలింగ్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు యువతిని కిందికి దించి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించాలనేది తన కుమార్తె కోరికని, ఆ ఒత్తిడితోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

కుత్బుల్లాపూర్: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓ బైకిస్ట్ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎస్‌కే జుమా(33) గుండ్లపోచంపల్లిలో ఉంటూ గత రెండు నెలలుగా గుండ్లపోచంపల్లిలోని అయోధ్యనగర్ క్రాస్ రోడ్డులో న్యూ బావర్చీ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 1న రెస్టారెంట్‌లో విధులు ముగించుకుని రాత్రి 7.30 గంటల సమయంలో జుమా యాక్టీవా బైక్(టీఎస్07ఎఫ్ఆర్ 2778)పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్టెర్లింగ్ హోమ్స్ సమీపంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం(ఏపీ07డీఎఫ్1536) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన జుమాకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని సుచిత్రలోని రష్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 9.30 గంటలకు మృతి చెందాడు. రెస్టారెంట్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠ నిలయ.. వరాహ గిరివర..

గోవిందా.. గోవిందా

వైకుంఠ ఏకాదశి సందర్భంగా విష్ణు నామస్మరణతో మార్మోగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం



- ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని వీక్షించేందుకు పోటెత్తిన భక్తులు

కుత్బుల్లాపూర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి భక్తులు వారి వారి సమీపంలోని ఆలయాలకు చేరుకుని ఉత్తర ముఖ ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ప్రత్యేకాలంకరణ..

ముక్కోటి ఏకాదశి పర్వదినమను పురస్కరించుకుని గత రెండు రోజుల నుంచే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయాలను ఆలయ కమిటీ సభ్యులు పూలతో.. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అదే విధంగా ఆలయంలోని మూల విరాట్‌ను వివిధ పుష్పాలతో తీర్చిదిద్దారు.



గోదావరి హోమ్స్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో..

- జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారాన్ని కల్పిస్తూ ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేలండర్లలతో పాటు ప్రసాదాలను ఉచితంగా అందజేశారు.
- గాజులరామారంలోని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, గోవిందరాజ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరి భక్తజనం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



జగద్గిరిగుట్ట వరదరాజ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



గోదావరి హోమ్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద..



జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద..



నిజాంపేట్‌లోని శ్రీ సీతారామచంద్ర ఆలయంలో జరిగిన పూజల్లో టీఆర్ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌లోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో మాజీ కార్పొరేటర్ పద్మ ప్రతాప్‌గౌడ్ దంపతులు





గాజులరామారం శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ఆలయంలో అన్నదానం చేస్తూ..

బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్



బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి కుత్బుల్లాపూర్‌లో కాషాయం జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ లాస్ట్ బస్టాప్ వద్ద సోమవారం డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ నాయకుడు మల్లారెడ్డితో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు ఎంత మంది కబ్జాదారులపై కేసులు నమోదు చేశారో పోలీసులు చెప్పాలన్నారు. ఈ భూకబ్జాలు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతోనే కొనసాగుతున్నాయని, దీంతోనే రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేసేందుకు వెనుకాడుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తత ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్‌యాదవ్, నాయకులు మోతే శ్రీనివాస్, సురేష్‌రెడ్డి, సిద్ధి రామ్‌రెడ్డి, అరికెల సుధా, అరుణరెడ్డి, వసుంధర, పత్తి రఘుపతి, పరశురామ్, అరుణ్, నర్సింగ్‌గౌడ్, రాజమ్మ, రాజు యాదవ్, మురళి గౌడ్ పడాల సత్యనారాయణ, సాంబయ్య, మణి గౌడ్ మల్లారెడ్డి, మనోహర్, రంగ, సీతారాం, గణేష్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి పెద్దపీట

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్ వార్డు నంబర్.1లోని రాయల్ పార్కు కాలనీలోని పార్కు అభివృద్ధి పనులను ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాను అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, పచ్చని మొక్కలు, వాకింగ్ ట్రాక్‌లతో పాటు పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్లే ఏరియాలను సమకూరుస్తున్నామని, అదే విధంగా వ్యాయామం చేసేందుకు వీలుగా ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు తదితరులు ఉన్నారు.



పార్కును పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్



నూతన సంవత్సరం 2023ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావును కలిసి పుష్పగుచ్ఛంను అందజేసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత. - కుత్బుల్లాపూర్

నూతన సంవత్సర సందర్భంగా జగద్గిరిగుట్టలో ఏసుబాబు ఆధ్వర్యంలో అశోకచక్ర దివ్యాంగులు, వితంతువులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘంలో నిర్వహించిన న్యూఇయర్ వేడుకలో కేక్ కట్ చేసి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న కొత్త శ్రీనివాస్, కృష్ణవేణి దంపతులు. - కుత్బుల్లాపూర్



నూతన సంవత్సర శుభాకాంక్షలు

రంగారెడ్డినగర్: నూతన సంవత్సరం 2023ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో సోమవారం జీఎం శ్రీధర్ రెడ్డికి కార్యాలయ సిబ్బంది, కార్యాలయం అనుబంధంగా పనిచేసే కాంట్రాక్టర్లు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసిన అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరంలో నీటి సమస్యలు తలెత్తకుండా తాగు, మురుగు నీటి పారుదల వ్యవస్థలపై మరింత ప్రత్యేక దృష్టితో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎం రాజేష్, రెవెన్యూ ఇన్‌చార్జి రామచందర్, రెవెన్యూ ఆఫీసర్ రాములు, సూపరింటెండెంట్ సునీల్, సెక్షన్ మేనేజర్లు శివ, ప్రసాద్, అనూష, పూజిత, ఝాన్సీ, కాంట్రాక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జీఎం శ్రీధర్‌రెడ్డికి శుభాంక్షలు తెలుపుతున్న దృశ్యం

59 జీఓతో ఇబ్బందులపై ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ నంబర్ 59లో అవకతవకలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. జీఓ నంబర్.59లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు జారీ చేస్తున్న నోటీసుల విషయమై సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సీపీఐ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ నరసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2014 భూ ధరల లెక్కల ప్రకారం.. సదరు స్థలం ధరలో 25 శాతంతో నోటీసులు ఇవ్వాలని పేర్కొంటే అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బాచుపల్లిలో గజం ధర రూ.21వేలు ఉందని, 60 గజాల స్థలాలకు రూ.12,60,000 అవుతుందని, కాని అధికారులు రూ.5 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారన్నారు. అదే 120 గజాలకు రూ.25 లక్షలు కట్టాలని నోటీసుల్లో పేర్కొనడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారని, ఈ పేదలకు న్యాయం చేయాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. సీపీఐ నాయకులు యాదయ్య, బాలనర్సయ్య, నగేష్ ఉన్నారు.

పైప్‌లైన్‌కు రోడ్డు తవ్వి వదిలేయడంతో పాట్లు



పీఎస్‌కు వెళ్లే దారిలో పైప్‌లైన్‌ను తవ్వి వదిలేసిన దృశ్యం

జగద్గిరిగుట్ట: జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేదారిలో ఇటీవ వాటర్ పైప్‌లైన్‌కు లీకేజీ తలెత్తడంలో అధికారులు ఈ ప్రాంతంలో రోడ్డును తవ్వారు. అయితే మరమ్మతులు చేపట్టకుండా గత వారం రోజులుగా అలాగే వదిలేయడంతో రాత్రివేళల్లో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు త్వరితగతిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి గోతిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.


యువత క్రీడల్లో ప్రతిభకనబర్చాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రంగారెడ్డినగర్: యువత క్రీడల్లో ప్రతిభ కనబరిచి అనుకున్న గమ్యాన్ని చేరాలని బిగ్ బ్లాస్ట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు మహమ్మద్ నాహీద్, మహమ్మద్ హాజీలు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బిగ్ బ్లాస్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్‌లోని ఈద్గా మైదానంలో మూడ్రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. సుమారు 35 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొనగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాబి టీమ్ విజేతగా, రన్నర్‌గా ఈశ్వర్ టీమ్ నిలిచాయి. ఈ సందర్భంగా విజేత జట్లకు బహుమతులు అందజేసిన అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకుని 14, 15 తేదీల్లో మరో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టు



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు

కుత్బుల్లాపూర్: సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల నిధుల మళ్లింపు ఇతర సమస్యలపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్‌ను రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాకు సోమవారం తరలి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డిని తెల్లవారుజాము 5 గంటల నుంచి గృహ నిర్బంధంలో ఉంచిన జగద్గిరిగుట్ట పోలీసులు అనంతరం స్టేషన్‌కు తరలించారు. గాజులరామారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మెంబర్‌షిప్ ఇన్‌చార్జి భరత్‌గౌడ్, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యూత్ ప్రెసిడెంట్ గవాని చందు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లాల్ మహమ్మద్, గాజులరామారం డివిజన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ దండే సతీష్ తదితరులను అరెస్టు చేసి అనంతరం సొంత పూచీకత్తుతో విడుదల చేశారు.

'ప్రభుత్వ స్థలం కబ్జాకు పన్నాగం జరుగుతోంది'

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో బీజేపీ నేతల ఫిర్యాదు



సర్వే నం.233లో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

నిజాంపేట్: రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే పన్నాగం జరుగుతోందని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ ఆరోపించారు. సోమవారం నిజాంపేట్ సర్వే నంబర్.233లోని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ నరసింహా రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గోకరాజు కాలేజీకి వెళ్లే దారిలో గల సర్వే నంబర్.233/1, 3లలో కార్పొరేషన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు 2020లో అప్పటి జిల్లా కలెక్టర్ 4.19 ఎకరాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ రూమ్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారని, కార్పొరేషన్‌కు చెందిన స్థలంగా పేర్కొంటూ నోటీసు బోర్డు సైతం ఏర్పాటు చేశారన్నారు. ఈ స్థలంపై కొందరు ప్రైవేట్ వ్యక్తులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని, ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలో కమిషనర్ గోపి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు కోర్టులో కౌంటర్ ఫైల్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వ్యక్తులు మేయర్ భర్త గోపాల్‌రెడ్డి చక్ర తిప్పారని, సదరు స్థలం కోర్టు వివాదంలో ఉందని పేర్కొంటూ బాచుపల్లిలోని సర్వే నంబర్.183లో స్థలాన్ని కార్పొరేషన్ కార్యాలయానికి తీర్మానం చేయించడం వెనుక భారీ కుట్ర దాగి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ స్థలాన్ని కాపాడడానికి సరైన విధంగా కౌంటర్ ఫైల్ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని, సదరు స్థలాన్ని ప్రజావసరాలకు వినియోగించాలని, అవసరమైతే పోలీస్ అధికారులు అడిగిన విధంగా 'భరోసా సెంటర్' కేటాయించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.